క్లుప్తంగా

వాయుపుత్రుడికి అభిషేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయ స్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయ స్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. అలాగే కౌతాళంలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

కమిషనర్ విస్తృత పర్యటన



మురుగు కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శనివారం విస్తృతంగా పర్యటించారు. ఇందిరానగర్, ఎస్కేడీ కాలనీ, శంకర్‌నగర్ ప్రాంతాల్లో మురుగు కాలువలు, కల్వర్టుల వద్ద జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో శానిటేషన్ మెరుగుపై అడిగి తెలుసుకున్నారు. ఇందిరానగర్ ప్రధాన కాలువలో అడ్డుగా ఉన్న చెక్క మొద్దును తొలగించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కౌతాళం: బదినేహాల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు తెలిపారు. శనివారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను వ్యాయమ ఉపాధ్యాయుడు నర్సింహరాజుతో కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి బాలికల ఖోఖో పోటీల్లో తన పాఠశాల 8వ తరగతి విద్యార్థిని రజియా, 7వ తరగతి విద్యార్థిని ఉష ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 25 నుంచి 27వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.


పొగాకు బానిసలు కావొద్దు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నందవరం : మహిళలు పొగాకు బానిసలు కావొద్దని ఏఎన్ఎం పుష్ప, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీ సూచించారు. శనివారం మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పొగాకు నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు ఇమ్యూనేషన్ చేపట్టారు. వారు మాట్లాడుతూ..పొగాకు, గుట్కా, తంబకు వంటివి వాడితే క్యాన్సర్ తదితర రోగాలు సంభవించి తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. గర్భిణులు నెల సరి టీకాలు తప్పని సరి వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త హేమలత, ఆశ వర్కర్ భూలక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాబుసుభాని గంధం వేడుకలు



విద్యుద్దీపాల అలంకరణతో దర్గా

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని రంగప్ప గట్టు వద్ద వెలసిన మాబుసుభాని గంధం వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. దర్గా నిర్వాహకులు చందఖాన్ కుమారుడు గౌస్ పీరా తాత ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతేహాలతో వేడుకలు నిర్వహించారు. ఆదివారం ఉరుసు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉరుసును పురస్కరించుకుని భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కుక్కలు భౌబోయ్!

- 19 రోజుల్లో 106 మందికి కుక్క కాటు
- ఈ వారంలో 27 మంది బాధితులు
- శునకాల స్వైరవిహారంపై మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం
- అయినా స్పందన అంతంత మాత్రమే



ఎమ్మిగనూరులోని చిన్నారి హాస్పిటల్ ప్రాంతంలో కుక్కల గుంపు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో రోజు రోజుకు కుక్కల బెడద పెరిగిపోతుంది. కుక్కలు పగలు, రాత్రి తేడా లేకుండా వీధుల్లో గుంపులు గుంపులుగా రోడ్లపై సంచరిస్తూ దారి వెంట వెళ్తున్న వారిని వెంబడిస్తున్నాయి. కుక్కల భయంతో చిన్న పిల్లలను బయటకు పంపటానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన వారు రాత్రి పూట ఇంటి వెళ్లేటప్పుడు ఈ కుక్కలను తప్పించుకొనిపోవాలంటే పెద్ద సమస్యగా మారింది. కుక్కల గుంపు మనుషులపై దాడి చేస్తే ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను నియంత్రించాలంటూ ఎమ్మెల్యే సైతం ఆదేశించినా చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో కుక్కల బెడద

ఎమ్మిగనూరు పట్టణంలో కుక్క బెడద అధికంగా ఉంది. పట్టణంలోని లక్ష్మీపేట, సోగనూరు రోడ్డు, ఇంద్రానగర్, ఎస్ఎంటీ కాలనీ, 2వార్డు, 7వ వార్డు, 12వ వార్డు, 28 వార్డు, టౌని ఏరియా తదితర ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లోనే ప్రజలు ఎక్కువగా కుక్క కాటుకు గురవుతున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గత 19 రోజుల్లో 106 మంది పిల్లలు, పెద్దలు కుక్కకాటుకు గురయ్యారు. ఈ వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు 27 మంది కుక్క కాటుకు గురై ప్రభుత్వాసుపత్రిలో టీకాలు వేయించుకున్నారు.

మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

పట్టణంలో కుక్కల స్వైర విహారంపై ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఇటీవల వార్డులో పర్యటించిన సమయంలో మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ఇకపై కుక్కలు కనిపిస్తే మీరు కమిషనర్‌గా ఎమ్మిగనూరులో ఉండరంటూ తీవ్రంగా హెచ్చరించడం పట్టణంలో చర్చానీయంగా మారింది. అయినా మున్సిపల్ అధికారులు కుక్కల పట్టివేతను నత్తనడకన చేపడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.



కుక్క కాటుకు గురైన బాలుడికి ప్రభుత్వాసుపత్రిలో టీకా వేస్తున్న దృశ్యం

కుక్క కాటుకు గురైన వారు జాగ్రత్తలు పాటించాలి



కుక్క కాటుకు గురైన వారు నిత్యం ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యం పొందుతున్నారు. కుక్క కాటుకు గురైన వారు వెంటనే కరచిన చోట సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా పారుతున్న కుళాయిల దగ్గర శుభ్రం చేసుకుంటే ఇంకా మంచిది. దగ్గరలో ఉండే డాక్టర్‌ను సంప్రదించి టీటీ ఇంజక్షన్, ఆర్వీ ఇంజక్షన్లు నాలుగు డోసులు వేయించుకోవాలి. కరచిన కుక్కను గమనించాలి అది పిచ్చికుక్కా, మంచి కుక్కా అనేది తెలుస్తుంది. పిచ్చి కుక్క అయితే నోటి నుంచి నురగ రావటం, కనిపించిన వారందని కరవటం జరుగుతుంది. కుక్కబట్టి వైద్యం ఉంటుంది.

– డాక్టర్ బాలాజీకుమార్, ఆర్ఎంఓ, ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రి

కుక్కలను పట్టివేస్తున్నాం

పట్టణంలో కుక్కలను పట్టివేస్తున్నాం. కుక్కలకు ఇంజక్షన్లు వేయిస్తున్నాం. పశువులతో పాటు కుక్కలను పట్టివేసే చర్యలు చేపట్టాం. మున్సిపల్ సిబ్బంది అదేపనిలో ఉన్నారు. కొన్ని రోజుల్లో కుక్కలన్నీ పట్టివేస్తాం.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతంలోకి తరలించాలి

ఆదోని టౌన్: పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు ప్రాంతంలో ఏర్పాటు చేసిన న్యూ చరణ్యశ్రీ వైన్స్‌ను వేరే చోటుకు మార్చాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్)అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్, విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎక్సైజ్ సీఐ సైదులుకు వినతి పత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ పేదలు, దినసరి కూలీలు నివసించే ప్రాంతం కావడంతో మహిళలు ప్రతిరోజూ మార్కెట్‌యార్డుకు, జిన్నింగ్ మిల్లులకు వెళ్లి వస్తుంటారన్నారు. మద్యంషాపు అక్కడ ఉండడంతో ఆకతాయిలు మత్తులో రాత్రుళ్లు పనుల నుంచి వచ్చే మహిళలను వేధించిన సంఘటనలు కూడా గతంలో ఉన్నాయని గుర్తు చేశారు. ఆకతాయిలు మహిళలపై మద్యం మత్తులో మహిళలను ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

కౌతాళం: శ్మశానంలో గుంతలు తీసి జీవనం చేసే కాటికాపర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపరుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిన్నమారయ్య, తాయప్ప డిమాండు చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఓకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. కాటికాపరులకు ప్రభుత్వం ప్రమాదబీమా, ఉచిత ఆరోగ్య బీమా కల్పించాలని, రెండు జతల బట్టలు ఇవ్వాలని బూట్లు, సాక్స్ చేతి తొడుగులు ఇవ్వాలని, అలాగే కాటికాపర్లు అందరికి పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. వీరేష్, జయరాం, యేసయ్య, తాయప్ప పాల్గొన్నారు.

బాలబాలికలు జాగ్రత్తగా ఉండాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్సీ డా. మధుసూదన్

ఆదోని సెంట్రల్: మహిళలతో పాటు బాలబాలికలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్సీ డా.మధుసూదన్, డీఎస్పీ సోమన్న సూచించారు. శనివారం (హ్యూమన్ ట్రాఫికింగ్) మానవ అక్రమ రవాణాపై ఫెయిత్ హోమ్ చిల్డ్రన్స్, ఆదోని ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మిగనూరు సర్కిల్‌లో మనవాహారంగా నిలిచారు. వారు మాట్లాడుతూ దేశంలో అపహరణకు గురవుతున్న వారిలో మహిళలు, అమ్మాయిలు 90 శాతం దాకా ఉన్నారన్నారు. ఆన్‌లైన్‌లో పరిచయాలు, ప్రేమ పేరుతో మోసపోవడం, బతుకు తెరువు కోసం విదేశాలకు వెళ్లడం, ఇంటి నుంచి పారిపోవడం వంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. కళాశాల నుంచి ఇంటికి వెళ్లేంత వరకూ జాగ్రతలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అలాగే చెడు సావాసాలు, అలవాట్లకు దూరంగా ఉండి మసులుకోవాలని తెలిపారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫెయిత్ హోమ్ నిర్వాహకులు డా. డానియేల్ ప్రేమ్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్ వీక్లిఫ్, ఉమాదేవి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి



మాట్లాడుతున్న డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు

గోనెగండ్ల : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించాగలరని డీఎస్పీ ఎం. ఉపేంద్ర బాబు సూచించారు. శనివారం గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్‌ను సీఐ గంగాధర్‌తో కలిసి సందర్శించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా ఉండి తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. చిన్నతనంలోనే భవిష్యత్ ప్రణాళికను ముందే ఎంచుకొని సమాజంలో మీరు గుర్తింపు తెచ్చుకునేలా ఎదగాలన్నారు. అలాగే బాలికలు మహిళా రక్షణ కోసం ఉన్న చట్టాలు గురించి తెలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం : నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సహకరించి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేద్దామని ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాంపురం, కాచాపురం, బసాపురం, ఖగ్గల్ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.30లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు పనులను వేగవంతంగా నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లుకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ శర్మ, ఎంపీడీఓ శోభరాణి, పంచాయతీ రాజ్ ఏఈ మల్లయ్య, ఏపీడీ లోకేశ్వర, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.భీమారెడ్డి, నాయకులు బాబురెడ్డి, పెట్రోల్ బంక్ శ్రీను, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్లు

నందవరం: పల్లె పండుగలో భాగంగా మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి గ్రామాల్లో మండల అధికారులు సీసీ రోడ్డు నిర్మాణం, మినీ గోకులాలకు భూమిపూజ చేశారు. శనివారం ఆయా గ్రామాల్లో ఎంపీడీఓ పుల్లయ్య, పీఆర్ ఏఈ నరసింహులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. రెండు గ్రామాలకు రూ.7 లక్షల చొప్పున రూ.14 లక్షలతో బీసీ కాలనీలో సీసీ రోడు నిర్మాణ పనులు చేపడతామన్నారు. అలాగే పెద్దకొత్తిలి గ్రామానికి చెందిన మహిళ రైతు రామేశ్వరమ్మకు మినీ గోకులానికి అధికారులు భూమిపూజ చేశారు. వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్, ఈజీ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.



సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దతుంబళం అభివృద్ధికి కృషి

ఆదోని టౌన్: మండలంలోని పెద్దతుంబళం గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి అన్నారు. శుక్రవారం గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రూ.12 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ ఏర్పాటుకు భూమిపూజ చేశారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాముడు

పెద్దకడబూరు : గ్రామ పంచాయతీలు అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు పని చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శనివారం రెండు రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమతమ గ్రామాలలో, వార్డులలో ఏఏ సమస్యలు ఉన్నాయో వాటని ఏ విధంగా పరిష్కరించాలో, సమస్యలను ఎలా గుర్తించాలి తదితర విషయాలను క్షుణ్ణంగా వివరించారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు యాక్టివ్‌గా ఉంటేనే గ్రామ పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, స్వచ్ఛభారత్ ఎమ్మార్సీ నారాయణ, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: గ్రామాలభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ బంగారమ్మ, ఈఓఆర్డీ విజయలక్ష్మీ అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు రెండవ రోజు శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ఎంపికైన వారు తమ గ్రామం అభివృద్ధిపై దృష్టి సారించాలని చెప్పారు. పారిశుధ్యం, తాగునీటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత మనందిరిపై ఉందని తెలిపారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన నాయకులు

నందవరం: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.నాగమణి పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని ప్రథమిక పాఠశాలలో సాయంత్రం స్వర్ణోత్సవ మండల మహాసభలను యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకులు ఎగురవేశారు. నాయకులు నాగమణి, దావీదు, ఎల్లప్ప మాట్లాడుతూ.. పాలకులు విద్యారంగం పట్ల తల్లి ప్రేమను చూపిస్తున్నారని ఆరోపించారు. అధికారం చేపట్టి నాలుగు మాసాలు అవుతున్నా కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల దృష్టి సారించలేదన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అబ్దుల్ రహేమాన్, మండల అధ్యక్షుడిగా ఆర్ వెంకటరాముడు, సహధ్యక్షుడిగా ఉసేనీ, కె.పద్మావతమ్మ, ఆర్థిక కార్యదర్శిగా ఎస్ నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా ఎన్. నాగరాజు, కార్యదర్శులుగా రంగన్న, వినోద్‌కుమార్, నాగరాజు, సురేంద్రబాబు, మహిళా విభాగం కన్వీనర్‌గా ఎం ఉమాదేవి, అడిటర్‌గా కె రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేలకొరిగిన వరిపైరు



కడదొడ్డి గ్రామంలో నెలకొరిగిన వరిపైరు

కౌతాళం/కోసిగి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను నదీతీర ప్రాంతాల రైతులకు తీరని నష్టం మిగిల్చింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు కౌతాళం మండలంలోని మేళిగనూరు, నదిచాగి, మరళి, కుంబళూరు, కుంబళూరు క్యాంప్ గ్రామాల్లో దాదాపు 200 ఎకరాలు, కోసిగి మండలంలోని కడదొడ్డి, తుంబిగనూరు, లక్ష్మీనగర్ క్యాంప్ గ్రామాల్లో 100 ఎకరాల వరి పైరు నేలమట్టమైంది. మరో 20 రోజులు వరి కోతలు కోయాల్సి ఉందని, వర్షాలు కారణంగా పంట పోలాలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. ఎకరాల 5 నుంచి 10 బస్తాలు మేరకు తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంట పొలాలను గుర్తించి ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్

ఆదోనిటౌన్: డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె.సుధ శనివారం తెలిపారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులను పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు.

12 నుంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

ఆదోని సెంట్రల్: ఏఐఎస్ఎఫ్ జిల్లా 30వ మహాసభలు నవంబర్ 12, 13వ తేదీల్లో ఆదోనిలో జరుగుతాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.షాబీర్ బాషా తెలిపారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. విద్య ప్రైవేటీకరణ, కషాయకరుణను వ్యతిరేకించడానికి విద్యార్థి లోకం ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దస్తగిరి, ఈరేష్, శ్రీకాంత్, ప్రభాకర్ రెడ్డి, జీవన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

264 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భాస్కర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామం వద్ద దయాల్బాగ్ రాధాస్వామి చారిటబుల్ హోమియో డిస్పెన్సరి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా ఉచిత హోమియో వైద్య శిబిరంలో 264 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కర్నూలు డిస్పెన్సరీ ప్రముఖ హోమియో వైద్య నిపుణులు కె.భాస్కర్‌రెడ్డి రోగులను పరీక్షించి వైద్యం అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దయాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, పాలక్షిరెడ్డి, మోనయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల, ఐటీఐ కళాశాలు ఏర్పాటు చేయాలి

కౌతాళం: మండలంలో గురుకుల పాఠశాలతో పాటు గురుకుల, ఐటీఐ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య వ్యవస్థాపకుడు కట్ట స్వామిదాసు డిమాండ్ చేశారు. శనివారం ఉరుకుంద గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయ్‌మోహన్, ఉపాధ్యక్షుడిగా గుడికంబాలి మారెప్ప, కార్యదర్శిగా చూడి అబ్రహం, సహాయ కార్యదర్శిగా బాపురం ఉలిగప్ప, సెక్రెటరీగా కాత్రికి ప్రకాశ్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని టౌన్: రీ–సర్వేలో నెలకొన్న రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శనివారం మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభకు ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ హాజరయ్యారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన గ్రామ సభల ద్వారా రీ సర్వేలో నెలకొన్న రైతుల భూ సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు. వాటిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామసభలో తహసీల్దార్ శివరాముడు, రీ సర్వే ఉప తహసీల్దార్ పెద్దయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

గోనెగండ్ల : భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శనివారం మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో దాదాపు 65 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీష, ఆర్ఐ జనార్దన్ రావు, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

నందవరం : మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు రీసర్వేలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో వివిధ రకాల భూ సమస్యలపై 51 అర్జీలు అందించారని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో తహసీల్దార్ నిత్యానంద రాజు, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో రైతుల భూముల రీసర్వే పై గ్రామ సభ నిర్వహించారు. 31 మంది రైతులు సమస్యల పై దరఖాస్తు చేసుకున్నా రు. ఆర్ఐ తిక్కస్వామి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని తహసీల్దారు శ్రీనాథ్ అన్నారు. మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో శనివారం గ్రామసభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తసీల్దారు గీతాప్రియదర్శిని, వీఆర్ఓ ఆంజనేయులు, తహసీల్దారు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో 90శాతం పైగా మార్కులు సాధించిన వీరశైవలింగాయత్ కులానికి చెందిన విద్యార్థులకు వీరశైవలింగాయత్ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వజ్రగిరి రచోటప్ప, మామిడి మల్లికార్జున తెలిపారు. శనివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం పెద్దకడబూరు, కోసిగి మండలాల్లోని వీరశైవలింగాయత్ విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా ఆధార్ కార్డ్, ఎస్ఎస్‌సీ, ఇంటర్ మార్క్ లిస్ట్, టీసీ, కులధ్రువీకరణ పత్రాలు జతపరిచి దరఖాస్తులను ఎమ్మిగనూరులోని ట్యాంక్‌బండ్ రోడ్డు వద్ద ఉన్న శారద ఎలక్ట్రానిక్స్ షాపులో సమర్పించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ కారణంగా ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణం, రూరల్ ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలన్నారు.